క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే దీక్షలు



నర్సాపూర్‌లో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న జేఏసీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు

నర్సాపూర్: డంప్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 33వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలో జేఏసీ నాయకులతో పాటు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొని తమ నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు రాజేందర్, నాగేందర్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఇమ్మడి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, రాఘవులు, శేఖర్, శ్రీనివాస్, మురళి, ప్రసాద్, ఓంకార్, చంద్రశేఖర్, ప్రవీణ్, నర్సింలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. డంప్‌యార్డుతో నర్సాపూర్ ఏరియా కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్యారానగర్‌లో డంప్‌యార్డు ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

క్షీరాభిషేకం



మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి దళిత సంఘాల నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రాజు, రంజిత్, శ్రీను, అజయ్, స్వామి, దయాకర్, భిక్షపతి, అశోక్, సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రోడ్డుపై నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని 2వ వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు ఆదివారం రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో డ్రైనేజీ పొంగడంతో దుర్వాసనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో పాటు భగీరథ నీరు రావడం లేదని, విద్యుత్ దీపాలు వెలగడం లేదని వాపోయారు. గతంలో ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలు



వీరోజిపల్లిలో నేలకొరిగిన జొన్నపంట

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో అకాల వర్షానికి ఆరుతడి పంటలు దెబ్బతిన్నాయి. శుక్రవారం రాత్రి వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని వీరోజిపల్లి, నారాయణపల్లి, ఉత్తులూర్, కొత్తపేట, జూకల్ తదితర గ్రామాల్లో జొన్నపంట దెబ్బతింది. దీంతో పాటు మామిడికాయలు నేలరాలాయి. పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఏఈఓలు పరిశీలించారు.

ఆలయ నిర్మాణానికి దాతల సహకారం



దాతలను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సహకరించేందుకు దాతలు ముందుకొచ్చారు. ఆదివారం పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో మేడి బాలపోచయ్య, లక్ష్మి దంపతుల కుటుంబ సభ్యులు మేడి శ్రీమాన్, బాలకృష్ణ, సుదర్శన్, మురళి ధ్వజ సంభం ఏర్పాటుకు రూ.3.16 లక్షలు అందించారు. అలాగే చిన్నశంకరంపేటకు చెందిన ఎన్‌ఆర్‌ఐ 200 బస్తాల సిమెంట్‌ను అందించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా దాతలను ముదిరాజ్ సంఘం సభ్యులు సత్కరించారు.

కరాటేతో బాలికల్లో ఆత్మస్థైర్యం



చేగుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్

- కరాటే మాస్టర్ విద్యాసాగర్
- పీఎం శ్రీ పాఠశాలల్లో కరాటే శిక్షణ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంతో పాటు చందాయిపేట ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణ కల్పిస్తున్నారు. చేగుంట, చందాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలు పీఎం శ్రీ పాఠశాలలుగా ఎంపికయ్యాయి. ఈ రెండు పాఠశాలల్లో విద్యార్థినుల ఆత్మ రక్షణ పెంపొందించుకునే ఉద్దేశంతో కరాటే శిక్షణ కల్పిస్తున్నారు. ప్రతీ విద్యా సంవత్సరంలో మూడు నెలల పాటు విద్యార్థినులకు గంట పాటు కరాటే శిక్షణ కల్పిస్తున్నారు. శిక్షణలో భాగంగా కరాటే పంచ్, కిక్స్, కటాస్‌తో పాటు సెల్ఫ్‌డిఫెన్స్ ఆర్ట్‌కు సంబంధించిన మెళకువలు నేర్పిస్తున్నారు. ఆరు నుండి పదో తరగతి వరకు చదువుకుంటున్న అమ్మాయిలకు మాత్రమే కరాటే శిక్షణ అందిస్తున్నారు. ఈరెండు పాఠశాలల్లో దాదాపు మూడు వందల మంది విద్యార్థినులు కరాటేలో నిష్ణాతులుగా మారేందుకు అవకాశం ఏర్పడనుంది.

ఏటా మూడు నెలల శిక్షణ



పీఎం శ్రీ పథకంలో ఎంపికైన చేగుంట, చందాయిపేట ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు మూడు నెలల పాటు శిక్షణ కల్పిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే ఆత్మస్థైర్యం పెంపొందించుకునేందుకు కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుంది. శిక్షణలో పాల్గొనేందుకు విద్యార్థినులకు తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలి.

– ఎంఈఓ. నీరజ, చేగుంట

పోటీల్లో పాల్గొనవచ్చు

విద్యార్థినులకు అందించే శిక్షణతో విద్యార్థినులు నిష్ణాతులైతే కరాటేకు సంబంధించిన పలు పోటీల్లో పాల్గొనవచ్చు. ఆపద సమయంలో విద్యార్థినులు నేర్చుకున్న కరాటే ఉపయోగ పడుతుంది. ప్రస్తుత కాలంలో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఎంతో అవసరంగా భావించాలి.

– విద్యాసాగర్, కరాటే మాస్టర్

ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



ఎంపీ రఘునందన్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్



మనోహరాబాద్(తూప్రాన్): ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఆదివారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసానికి మల్లేశ్‌గౌడ్ వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా నర్సాపూర్‌కు చెందిన పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీయాదవ్‌తో పాటు పలువురు నాయకులు వేర్వేరుగా వెళ్లి ఎంపీని సన్మానించారు.

బంగారమ్మ దేవాయలంలో పూజలు

మనోహరాబాద్(తూప్రాన్): మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జన్మదిన వేడుకల్లో భాగంగా బీజేపీ నాయకులు పురం మహేశ్ ఆధ్వర్యంలో ఆదివారం కాళ్లకల్ బంగారమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మనోహరాబాద్ మండల నాయకులు మల్లేశ్, చంద్రశేఖర్, కమ్మరి నరేందర్‌చారి, బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, లక్ష్మణ్‌సింగ్, మురళి, నాగరాజు, నరేష్‌గౌడ్, సత్యనారాయణ, నర్సింలు, మల్లేశ్, కృష్ణ, మహేశ్ తదితరులు కలిసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

పాపన్నపేట(మెదక్): మెదక్ ఎంపీ రఘునందన్ రావు జన్మదిన వేడుకలు ఆదివారం పాపన్నపేటలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బీకొండ రాములు, మాజీ అధ్యక్షులు సంతోష్, దుర్గాప్రసాద్, నరేష్, భాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించండి

- పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి ఆసిఫ్



మాట్లాడుతున్న ఆసిఫ్

మనోహరాబాద్(తూప్రాన్): నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి ఆసిఫ్ తెలిపారు. ఈ నెల 25 చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆదివారం చెప్పారు. మండల కేంద్రంలో మండల పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులతో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. అందరూ చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు స్వామి, రాములు, అర్జున్, అంజయ్య, శంకరయ్య, సత్యనారాయణ, లక్ష్మణ్, సులోచన, యాదమ్మ తదితరులున్నారు.

నేడు నర్సాపూర్‌లో తైబజార్ వేలం

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో తైబజార్ వసూలు చేసే పనిని అప్పగించేందుకు సోమవారం వేలం వేయనున్నట్లు కమిషనర్ రామకృష్ణరావు చెప్పారు. తమ కార్యాలయ ఆవరణలో తైబజార్, పశువుల సంత కార్యక్రమాలకు సంబంధించిన వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వ్యక్తులు పాల్గొనాలని కోరారు.

మా రోడ్డు మాకే దక్కాలి

– కేసీఆర్ కాలనీవాసుల నిరసన సంతకాల సేకరణ



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని కేసీఆర్ కాలనీకి మంజూరైన బీటీరోడ్డు మాకే దక్కాలని, ఎవరు అడ్డం వచ్చినా ఊరుకునేది లేదని కేసీఆర్ కాలనీవాసులు కమాన్ వద్ద నిరసన సంతకాలు సేకరించారు. ఆదివారం కాలనీకి చెందిన సంఘ సభ్యులు అందరూ దాదాపు 200 మంది కాలనీవాసులతో సంతకాల సేకరించారు. అనంతరం కేసీఆర్ కాలనీకి వచ్చే బీటీరోడ్డు పనులను అడ్డుకున్న మూడో వార్డు వద్దకు చేరుకున్నారు. మాకు డ్రైనేజీలు కట్టే వరకు మేము రోడ్డు నిర్మాణం చేపట్టేది లేదని అనడంతో కాలనీవాసులకు మూడో వార్డు ప్రజలకు తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న రామాయంపేట ఎస్‌ఐ బాలరాజు, పీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు, మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, అల్లాడి వెంకటేష్ అక్కడ చేరుకొని ఇరువురిని సముదాయించి ఇక్కడ డ్రైనేజీకీ కూడా నిధులను మంజూరు చేస్తానని సుప్రభాతం తెలిపారు. దీంతో ఇరువురి వాగ్వాదం సద్దుమణిగింది.

గ్రంథాలయంలో షహీద్ దివస్



హహీద్ దివస్‌లో పాల్గొన్న సుహాసినిరెడ్డి

నర్సాపూర్: పట్టణంలోని గ్రంథాలయంలో షహీద్ దివస్ కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేయగా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో అడ్మిన్ కంపెనీ షాహిద్ దివస్ సెట్, భగత్ సింగ్ ఫస్ట్ డే పోస్టల్ కవర్, శివరాం హరి, రాజ్‌గురు పోస్టల్ స్టాంప్, భగత్ సింగ్ కాయిన్స్, ఆయన జీవిత చరిత్ర పుస్తక ప్రదర్శనను సుహాసినిరెడ్డి తిలకించి వారి సేవలను గుర్తు చేశారు. లైబ్రేరియన్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

హైవేపై గుంతలతో ఇబ్బందులు



ఎస్‌బీఐ మూల మలుపు వద్ద గుంతలతో మట్టి మయంగా మారిన రోడ్డు

నర్సాపూర్: పైపులైన్ మరమ్మతుల కోసం జాతీయ రహదారిని, దానిని ఆనుకొని ఉన్న రోడ్డును తవ్వగా ఏర్పడిన గుంతలను సరిగా పూడ్చకుండా అధికారులు వదిలేశారు. మిషన్ భగీరథ, జాతీయ రహదారి, భగీరథ పథకం కాంట్రాక్టు సంస్థల మధ్య సమన్వయం లేకపోవడంతో రోడ్డుపై తవ్విన చోట సరిగా మరమ్మతులు చేయలేకపోయారని ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో మూల మలుపు వద్ద మిషన్ భగీరథ పథకానికి చెందిన పైపులకు లీకేజీ ఏర్పడి శుద్ధీ చేసిన నీరు రోజులు పాటు వృథాగా పోయింది. లీకేజీలకు మరమ్మతు చేసేందుకు జాతీయ రహదారితో పాటు పట్టణంలోకి వచ్చే మూల మలుపు వద్ద సుమారు నెల రోజుల క్రితం గుంతలు తీసి పైపులైన్‌కు మరమ్మతు చేయించారు. మరమ్మతు కోసం తవ్విన గుంతలను సరిగ్గా పూడ్చలేదు. జాతీయ రహదారిపై తవ్విన చోట గుంతను సరిగా పూడ్చి తారు వేయాల్సి ఉండగా కంకర చిప్‌తో పూడ్చారు. కంకర చిప్‌పై నుంచి వాహనాలు వెళ్లడంతో చిప్ దుమ్ముగా మారడంతో రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోకి వచ్చే మూల మలుపు వద్ద తవ్విన చోట సైతం సిమెంట్ రోడ్డు వేయకుండా తాత్కాలికంగా మట్టితో పూడ్చి వదిలేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **నర్సారెడ్డి పోరుబాటలో నాయకుల మద్దతు**



తూప్రాన్: గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండకుండా వ్యవహరిస్తున్న కేసీఆర్ తీరును వ్యతిరేకిస్తూ సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి చేపట్టిన పోరుబాటలో తూప్రాన్ మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం పాల్గొని మద్దతు తెలిపారు. ఈ పోరుబాటకు మంత్రి పొన్నంప్రభాకర్ సైతం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు భగవన్‌రెడ్డి, రవీందర్ గుప్తా మాట్లాడుతూ.. కేసీఆర్ వైఖరి వల్లే నియోజకవర్గంలోని తూప్రాన్ ఉమ్మడి మండలంలో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని విమర్శించారు. పాదయాత్రగా రాజ్‌భవన్ వరకు చేపట్టిన పోరుబాటకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు కృష్ణాగౌడ్, లక్ష్మీనర్సింహగౌడ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు తెలిపారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల కేంద్రంలో 14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, సిద్దిరాములుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో రూ.10 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఆదివారం నార్సింగిలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ టెలికాం బోర్డు సభ్యుడు రాజేశ్, ప్రభాకర్‌లు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

◆ **అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి**



రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని ఆర్ వెంకటాపూర్ మాజీ సర్పంచ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాలలోకి వెళ్తే... ఆర్ వెంకటపూర్ గ్రామానికి చెందిన సీతగారి ఎల్లారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామ సర్పంచ్‌గా రెండు సార్లు గెలిచి ఎన్నో అభివృద్ధి పనులు చేసిన ఆయన ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు.



గురువులతో పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో 1987–88బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాములు, శర్మ, లక్ష్మయ్య, పోచయ్య, నరేష్, కాశీనాథ్, సామేల్‌కు పూలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఒకచోట కలవడంతో ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ పనుల్లో లోపిస్తున్న నాణ్యత



చండీలో సీసీరోడ్డు పనులు చేస్తున్న కూలీలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత లోపిస్తుంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సదరు గుత్తేదారులు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో సంబంధిత శాఖ సిబ్బంది ఉండాలి. కానీ వారు లేకపోవడంతో సిమెంట్, కంకర, ఇసుక సమపాలల్లో లేకుండా పనులు చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మార్చి నెలఖారు వరకు పనులు పూర్తి చేస్తే ఈ సంవత్సరంలోకి వస్తుండడం వల్ల బిల్లులు త్వరగా వచ్చే ఆస్కారం ఉండడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సంబంధిత పీఆర్ శాఖ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక బదులు అధిక శాతం డస్ట్ వేస్తు పనులు చేస్తున్నారు. ఈ విషయం గురించి పీఆర్ ఏఈ భాస్కర్ రావు దృష్టికి తీసుకెళ్లగా.. అన్నిచోట్ల ఒకేసారి పనులు జరుగుతుండడంతో కొన్ని చోట్ల నేను మరికొన్ని చోట్ల కిందిస్థాయి సిబ్బంది ఉండే విధంగా చూస్తున్నామన్నారు.

ఆశ వర్కర్ల ముందస్తు అరెస్ట్

చిన్నశంకరంపేట(మెదక్): బడ్జెట్‌లో నిధులు తగ్గించారని సోమవారం హైదారాబాద్ కమిషరేట్ వద్ద జరిగే ధర్నాకు వెళ్లకుండా ఆశ వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆశ వర్కర్ల ఇళ్ల నుంచి పోలీస్‌లు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు దేవమ్మ మాట్లాడుతూ.. ఆశవర్కర్ల హక్కుల కోసం పోరాటం చేసేందుకు అవకాశం లేకుండా ప్రభుత్వం అనగదొక్కుతుందన్నారు. సోమవారం ధర్నా ఉంటే ఆడబిడ్డలు అనికూడా చూడకుండా ఒక రోజు ముందు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం ఎంటని ప్రశ్నించారు.



చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న దేవమ్మ

విద్యార్థుల సేవాభావం అభినందనీయం



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

- పీజేటీఏయూ రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థుల సేవాభావం అభినందనీయమని పీజేటీఏయూ (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం) రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తునికి గ్రామంలో వారం రోజులుగా సంగారెడ్డి జిల్లా కంది వద్దగల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు సేవాభావంతో ముందుకెళ్లాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సమాజంపై అవగాహన కలుగుతుందన్నారు. మారుమూల గ్రామాల్లో సేవచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మనోజ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ హరి, డాక్టర్ రమేశ్, డాక్టర్ నీలాంభిక, మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల చేయూత

కౌడిపల్లి(నర్సాపూర్): గుండెపోటుతో మృతి చెందిన 108డ్రైవర్ కుటుంబానికి ఆదివారం చిన్ననాటి స్నేహితులు చేయూతనిచ్చి అండగా నిలిచారు. మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీనివాస్ కౌడిపల్లిలో 108 డ్రైవర్‌గా విధులు నిర్వహించారు. శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు జరగగా, కౌడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 1999–2000బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మృతుడికి కుటుంబానికి రూ. 20వేలు ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. దీంతోపాటు కుమ్మరి సంఘం సభ్యులు, 108 మిత్రులు మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



తునికి నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

సికింద్లాపూర్‌లో..

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్‌గుప్తా, ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి, తదితరులు ఉన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి గ్రామ సమీపంలోని నల్లపోచమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేష్ నల్లపోచమ్మకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పాటు పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.